క్లుప్తంగా

పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

నూజెండ్ల: పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో నూజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు పౌష్టికాహారం నిమిత్తం నూజెండ్ల మోడల్ స్కూల్‌కు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. గంగినేని రాఘవ, కాజా రమేష్, ఏవీఆర్ కుమార్ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారికి అందజేశారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

గాలికుంటు నివారణకు టీకా చేయించాలి

శావల్యాపురం: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని వేల్పూరులో పశువుల్లో గాలి కుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం శనివారం సెక్టారు పశువైద్యాధికారి పి.గణేష్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులను నియంత్రణ చేయటానికి తప్పనిసరిగా గాలికుంటు టీకా చేయించాలన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



నరసరావుపేట టౌన్: రిమాండ్ ఖైదీలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక అన్నారు. శనివారం సబ్‌జైలును సందర్శించారు. అక్కడ అందుతున్న సేవల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జైలు అధికారులకు సూచించారు. ఖైదీలకు సంబంధించి సబ్‌జైలులో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను పరిశీలించారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకునేందుకు స్థోమత లేనివారు తమకు లిఖిత పూర్వకంగా అర్జీ అందజేస్తే మండల న్యాయసేవ సహాయక కేంద్రం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సబ్ జైలర్ రవి కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

వేల్పూరులో అంగన్‌వాడీల అవగాహన ర్యాలీ

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలో పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నియంత్రణ చేయటంతో పాటు పోషకాలు కలిగిన ఆకుకూరలు, క్యారెట్, బీట్‌రూట్ తినటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జంగాల అనిత, కార్యకర్తలు శేషకుమారి, రాధ, సుధారాణి, ఆశా, ఈశ్వరమ్మ, మాధవిలత, రమాదేవి, ఆరోగ్య సూపర్‌వైజరు సాయిగీతా, ఆరోగ్య కార్యకర్త అమరలింగేశ్వరి, మహిళా పోలీసు మరియకుమారి పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలి

నాదెండ్ల: ఆడపిల్లలను ఉన్నత చదువు చదివించి వారు జీవితంలో స్వశక్తితో నిలిచేలా తల్లిదండ్రులు, కుటుంబం అండగా నిలవాలని ప్రిన్సిపాల్ మాధవిలత చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో గడిచిన నాలుగు రోజులుగా బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై విద్యార్థినుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు ఆర్.రత్నకుమారి, సీహెచ్ వెంకటలక్ష్మి, పి.మాణిక్యం పాల్గొన్నారు.

కారుమంచిలో ఎస్‌ఐ పల్లెనిద్ర

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో శనివారం నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఎస్‌ఐ గల్లా రవికృష్ణ పాల్గొన్నారు. రవికృష్ణ మాట్లాడుతూ వివాదాలకు అతీతంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఎమైనా సమస్యలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చట్ట ప్రకారం వీలైనవంత వరకు సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బొల్లా వెంకట సాంబశివరావు, అడుసుమల్లి వెంకట నరసింహారావు, బొల్లా పేరయ్య, కిలారి సుబ్బారావు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: ఓ యువకుడు ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకున్న ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఆరో వార్డు ఎన్టీఆర్ కాలనీకు చెందిన పోలూరి రమేష్‌బాబు(47) డిగ్రీ వరకు చదివాడు. వివాహం అయి పిల్లలు ఉన్నారు. మానసిక సమస్యతో బాధపడుతుండడంతో విడిపోయారు. నాటి నుంచి నాయనమ్మతో కలసి ఎన్టీఆర్ కాలనీలో ఉంటున్నాడు. అయితే మానసిక పరిస్థితి బాగోలేని రమేష్ రెండేళ్ల కిందట నాయనమ్మతో గొడవపడ్డారు. తలపై కొట్టడంతో ఆమె చనిపోయింది. అప్పటి నుంచి అతడిని ఎవరూ పట్టించుకోక పోవడంతో అనాథలా జీవిస్తున్నాడు. శనివారం పట్టణంలోని 16వ నంబర్ జాతీయ రహదారి ఓగేరు వాగు సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



యక్కలవారిపాలెంలో అరటి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి బెన్ని

నరసరావుపేట రూరల్: అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని యక్కలవారిపాలెంలో దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న పంటలను శనివారం పరిశీలించారు. పంట చేతికొచ్చే దశలో ఉన్న అరటి పంట ఈదురు గాలుల కారణంగా నేలవాలినట్లు రైతులు తెలిపారు. నేలవాలి వర్షపు నీటిలో ఉన్న మొక్కజొన్న పంటను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యక్కలవారిపాలెం పరిధిలో సుమారు 20 ఎకరాల్లో అరటి తోటలకు పూర్తిగా నష్టం జరిగిందన్నారు. మొక్కజొన్న నేలవాలిందని, కల్లాల్లో ఉన్న మిరప పంట తడిచిపోవడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పంట నష్టం అంచనాలను ఈనెల 31వ తేదీలోగా తయారు చేయాలని అధికారులకు ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చారన్నారు. నరసరావుపేట మండలంలో 500 ఎకరాలు, రొంపిచర్ల మండలంలో 1100 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారుల ప్రాథమిక అంచనాగా ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పంటనష్టం జరిగిన మూడు సంవత్సరాల తరువాత కూడా నష్టపరిహారం చెల్లించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వ పరిహారం బకాయిలు రూ.1700 కోట్లు రైతులకు చెల్లించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బెన్ని, ఏడీఏ మస్తానమ్మ, ఏఓ నరేంద్రబాబు, ఉద్యాన అధికారి నవీన్‌కుమార్, వైస్ ఎంపీపీ వెంకటప్పారెడ్డి, నక్కా వెంకటకోటేశ్వరరావు, హరిబాబు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు అన్నింటినీ చెల్లిస్తాం

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఆస్తి, కుళాయి పన్ను వసూలు లక్ష్యానికి చేరుకుంటున్నాయని, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు అన్నింటిని చెల్లించటం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గతంలో 31వ వార్డులో చేపట్టిన పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌లో సూచించిన పనులను శనివారం ద్విచక్ర వాహనంపై పర్యటిస్తూ పరిశీలించారు. వార్డు పరిధిలోని కత్తవ డ్రెయిన్‌లో చేస్తున్న పూడికతీత పనులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. స్థానికులను శానిటేషన్ పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని 26, 31 వార్డుల నుంచి మురుగు కాలువను శుభ్రం చేయించినట్లు చెప్పారు. అలాగే ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ అవకాశాన్ని ఉపయోగించి పురపాలక సంఘానికి రావాల్సిన రూ.13.5కోట్ల ఆస్తిపన్ను, కుళాయి పన్నులను వసూలు చేసే లక్ష్యంలో విజయం సాధించి ఇప్పటి వరకు రూ.11.5 కోట్లు వసూలు చేయటం జరిగిందన్నారు. ఎన్నోరోజుల నుంచి బకాయి పడిన ఎస్ఎస్ఎన్ కళాశాల నుంచి రూ.1.63 కోట్లు రావాల్సి ఉండగా రూ.1.06 కోట్లు, పీఎన్‌సీ కళాశాల రూ.50 లక్షలు, రెడ్డి కళాశాల నుంచి రూ.24 లక్షలతో సుమారుగా కళాశాలల నుంచి రూ.2.5కోట్లు వసూలు చేయటం జరిగిందన్నారు. కోర్టు కేసులను పక్కన పెట్టించి యాజమాన్యాలతో మాట్లాడి పన్ను రాయితీ ఉపయోగించుకోవాలని కోరిన మీదట వారు స్పందించి పన్నులు చెల్లించారన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులు చెల్లిస్తామని, చేయాల్సిన పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డీఈఓ శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు కారుమంచి మీరావలి, మాడిశెట్టి మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వంకా వీరారెడ్డి, కురుగుంట్ల కోటిరెడ్డి, స్వర్ణ చినరామిరెడ్డి, వరవకట్ట బుజ్జి పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌లో సత్తా చాటిన విద్యార్థులు



చిరుమామిళ్ల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఝాన్సీవాణి తదితరులు



స్కాలర్‌షిప్‌లకు ఎంపిక వెల్లటూరు విద్యార్థులతో టీచర్లు..



ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం వరప్రసాద్



పేటలో విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

నాదెండ్ల: నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ ఉపకార వేతనాలకు మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థుల ఎంపికయ్యారు. చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు గత నెల 5వ తేదీన ఉపకార వేతనాల ఎంపిక పరీక్షకు హాజరై ఉత్తమ ప్రతిభతో అర్హత సాధించారు. జిల్లాలో 14 ఏపీ మోడల్ పాఠశాలలకు గాను చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల రెండో స్థానంలో నిలిచింది. వీరిలో వై సోఫియాగ్లాడీ, ఎం జయశ్రీ, ఎన్ ప్రవల్లిక, విటికె వర్షితలు ఎంపికయ్యారు. గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సప్పిడి సాత్విక, కనపర్రు జెడ్పీ హైస్కూలుకు చెందిన ఊసర్తి మౌనిక, చిరుమామిళ్ల జెడ్పీ హైస్కూలుకు చెందిన యామర్తి బిందు, సాతులూరుకు చెందిన షేక్ షహనాజ్, తూబాడుకు చెందిన ప్రత్తిపాటి అమూల్య, నాదెండ్లకు చెందిన కొరివి కేజీయా, చందవరానికి చెందిన గుంటు రజిని ఎంపికయ్యారు. వీరికి 9,10 తరగతులతో పాటూ ఇంటర్మీడియెట్ రెండు సంవత్సరాలకు గాను ప్రతి ఏటా రూ.12 వేలు నగదును కేంద్ర ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనుంది. విద్యార్థులను ఎంఈఓ ఆంజనేయులు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు టి.సత్యనారాయణ, ఝాన్సీవాణి, వై.వాణి, బి.ఉషశ్రీ, పి.ప్రసాద్, సుందరరావు, టి.నగేష్, ఎం.మాధవీ అభినందించారు.

బొల్లాపల్లి మండలంలో..

బొల్లాపల్లి: నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని హైస్కూల్స్ నుంచి 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అందులో వెల్లటూరు హైస్కూల్ నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వి.పద్మావతి చెప్పారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ ఎం.గురునాథం, సర్పంచ్ ఎం.చిన్నవీరయ్య, ఉపసర్పంచ్ గురునాథం, లక్ష్మీనారాయణ అభినందించారు.

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఆరుగురు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీఏఎల్ వరప్రసాద్ శనివారం తెలిపారు. గత నెల 5వ తేదీన నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో తమ విద్యార్థులు 132, 131 మార్కులతో జిల్లా స్థాయిలో 9,14 స్థానాల్లో నిలవడంతో పాటు మంచి మార్కులు సాధించి ఆరుగురు విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు వివరించారు.

చిలకలూరిపేటలో..

చిలకలూరిపేట: విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక కావడం అభినందనీయమని పసుమర్రు జెడ్పీహైస్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ ఎర్రం వెంకటసుబ్బయ్య చెప్పారు. పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు షేక్ మహమ్మద్ అల్తాఫ్, నార్నెపాటి పార్వతి, ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు అర్హత సాధించారు. ఈ విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు మహమ్మద్ గౌస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం షేక్ మొహమ్మద్ యాసిన్, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మన ఆలోచనలే మనల్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్తాయి

- హెచ్‌ఎం ఘంటసాల షేక్ కరీముల్లా
- ఘనంగా మురికిపూడి జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిలకలూరిపేట టౌన్: మన ఆలోచన విధానాలే ఉన్నత శిఖరాలను చేరుస్తాయని హెచ్‌ఎం ఘంటసాల షేక్ కరీముల్లా చెప్పారు. మండలంలోని మురికిపూడిలోని జెడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కేవలం ఇంజినీరింగ్ కోర్సుల్లోనే కాకుండా సీఈసీ, హెచ్‌ఈసీ, పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపాలన్నారు. ఆయా కోర్సుల్లో ఉన్నతస్థాయి చేరేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను సాధించి తాము చదివిన పాఠశాలకు, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలని కోరారు. పది పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు దాతలు నగదు ప్రోత్సాహకాలను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అచ్చేమియా, కవితా, హనుమానాయక్, రవి, ప్రవీణ్, సుగుణ, నాగేశ్వరీ, మాధవీ, మొబిన్ సైదాబి, లలిత, కల్యాణి పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలి

నరసరావుపేట: జిల్లాలో ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయని పక్షంలో తమ పార్టీ నాయకులు ఇసుక రేవుల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు హెచ్చరించారు. శనివారం సత్తెనపల్లిరోడ్డులోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి ఈనెల 23వ తేదీ ఎన్‌జీటీ ఇసుక రీచ్‌లు నడపవద్దని తీర్పు చెప్పిందన్నారు. మిషనరీని ఉపయోగించకుండా మనుషులతోనే ఇసుకను తవ్వి రీచ్‌ల నుంచి బయటకు తీసుకొచ్చే విధంగా అనుమతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. పెదకూరపాడు అసెంబ్లీ పరిధిలో కోర్టు తీర్పును పట్టించుకోకుండా మూడు రోజులుగా ఇసుక తవ్వకాలను చేస్తున్నారన్నారు. సమావేశంలో నరసరావుపేట ఇన్‌చార్జి రంగిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం



చిలకలూరిపేట టౌన్: పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు చిలకలూరిపేట ఆర్టీసీ డీఎం ఎస్.రాంబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ వద్ద బస్‌పాస్ లేకపోయినా తమ ఒరిజనల్ హాల్ టికెట్‌ను కండెక్టర్‌కు చూపి అన్ని పల్లెవెలుగు(ఆర్డనరీ) బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. నియోజకవర్గంలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బొల్లాపల్లి: పోషకాహార మహోత్సవాల్లో భాగంగా మండలంలోని బొల్లాపల్లి సెక్టార్ రేమిడిచర్ల తండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి వి.బ్రహ్మనాయక్ పాల్గొన్నారు.

మూడో విడత ఆసరా నగదు జమ

బొల్లాపల్లి: వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా 3వ విడత నగదు ఆయా పొదుపు సంఘాల ఖాతాల్లో జమ అయినట్లు వెలుగు పథకం ఏపీఎం పీవీ రంగారెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని 770 గ్రూపులకు రూ.5.24కోట్ల మేర లబ్ధి పొందారని తెలిపారు. ముఖ్యమంత్రివైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడో విడత ఆసరా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారని చెప్పారు.

వైఎస్సార్ కంటివెలుగులో 185 మందికి పరీక్షలు

నాదెండ్ల: అరవై ఏళ్ల పైబడిన వృద్ధులకు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శుక్లాల ఆపరేషన్లు చేయిస్తామని నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రియాంక చెప్పారు. చిరుమామిళ్ల గ్రామంలో శనివారం వైఎస్సార్ కంటి వెలుగు మూడో ఫేజ్ కింద 185 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి సింగారెడ్డి లక్ష్మి, ఆప్తమాలజిస్ట్ మురళీకృష్ణ, సీహెచ్‌ఓలు పద్మావతి, రత్నరాజ్యం, ఎంపీహెచ్‌ఈఓలు భూపతిరావు, విజయరాజు, ఏఎన్‌ఎంలు శివకుమారి, హెచ్‌ఏ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శనగ కొనుగోలు కేంద్రం పరిశీలన

శావల్యాపురం: శనగలు కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు కోరారు. మండలంలోని వేల్పూరులో సొసైటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ క్వింటాకు రూ.5335 ధర నిర్ణయించినట్లు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇప్పుటికే కొత్తలూరు గ్రామంలో 38 మంది, వేల్పూరులో 18 మంది నమోదు చేసుకున్నారని, వీరందరు దగ్గర శనగలు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు శావల్యాపురం సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాద్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు స్వర్ణాల వెంకట్రావుతో పాటు తూమాటి కబ్బారావు, లింగా శ్రీనివాసరావు, రైతు భరోసా వీఏఏ అనుషా, ఎంపీఈఓ హరిబాబు ఉన్నారు.

సమన్వయంతో పనిచేస్తే బాలల హక్కులకు రక్షణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు బి.దేవేంద్రరెడ్డి, కె.రత్నకుమార్, డీఎస్పీ రవిచంద్ర తదితరులు

నరసరావుపేట: న్యాయ వ్యవస్థ, పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు కలసి సమన్వయంతో పనిచేసినప్పుడే బాలల హక్కులు పరిరక్షించే అవకాశం ఉంటుందని గుంటూరు, పల్నాడు జిల్లాల న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శులు, న్యాయమూర్తులు కె.రత్నకుమార్, బి.దేవేంద్రరెడ్డి అన్నారు. శనివారం న్యాయవిజ్ఞాన సదస్సులో భాగంగా స్థానిక శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, ల్యాంప్ సంస్థల ఆధ్వర్యంలో బాలల స్నేహపూర్వక పద్ధతులు, రక్షణ యంత్రాంగాలు అనే అంశంపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర బాలల పరిరక్షణ యూనిట్ ప్రాజెక్టు మేనేజర్ ఐజీ విజయ్‌కుమార్ జువెనైల్ జస్టిస్‌పై శిక్షణ ఇస్తూ చట్టంతో విభేదించిన బాలల సంక్షేమం గురించి వారిలో మానసిక పరివర్తన తీసుకొచ్చే పద్ధతులు గురించి వివరించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ అరుణ మాట్లాడుతూ బాలల సమగ్ర అభివృద్ధికి సమాజం బాధ్యత వహించాలని అన్నారు. దిశ డీఎస్పీ యు.రవిచంద్ర మాట్లాడుతూ బాలికలు, మహిళలతోఅసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ల్యాంప్ సంస్థ బాలలహక్కులపై ముద్రించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి విజయ్ కుమార్, భేటీ బచావో ఆందోళన రాష్ట్ర కన్వీనర్ తిరుపతిరావు, అప్‌లిఫ్ట్ సంస్థ డైరెక్టర్ తురక మంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా ముప్పాళ్ల చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల



ప్రజలకు సర్దిచెబుతున్న ఎమ్మెల్యే బొల్లా

ఈపూరు: మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్లలో మహిళలు భారీస్థాయిలో పాల్గొని బోనాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి పొంగుబాలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఎల్లప్పుడు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు భారీ విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం చేశారు.

ప్రభ నిర్మాణం విషయంలో వాగ్వాదం

ఈపూరు: ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయమైన తిరునాళ్ల ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సూచించారు. మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా శనివారం వైఎస్సార్ సీపీకి చెందిన రెండు ప్రభలు, టీడీపీ ఒక ప్రభను నిర్మిస్తున్నారు. అయితే టీడీపీ వారు నరసరావుపేట వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ప్రభను కట్టేందుకు సిద్ధమవుతుండగా అందుకు పోలీస్ వారు అనుమతి ఇవ్వలేదు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, టీడీపీ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రోడ్డుకు కొంచెం పక్కగా ప్రభను నిర్మించుకోవాలని పోలీసుల వారితో పర్మిషన్ ఇప్పించారు. ప్రభ నిర్మించుకునేందుకు పర్మిషన్ ఇప్పించిన స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు చౌడయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేవరాజ్, సొసైటీ అధ్యక్షుడు బొల్లా బుజ్జి, బుచ్చయ్య, వెంకటహనుమయ్య ఉన్నారు.

టీకా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

శావల్యాపురం: చిన్నారులకు సాధారణ టీకా ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా వైద్య ఆరోగ్య అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా టీకా కార్యక్రమ పర్యవేక్షణ అధికారి డాక్టరు బత్తుల గీతాంజలి అన్నారు. శనివారం మండలంలోని గంటావారిపాలెం, వేల్పూరు ఉప ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి వారంలో బుధ, శనివారం రెండు రోజుల పాటు ప్రభుత్వ పరంగా అందించుతున్న అన్నీ రకాల టీకాలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. టీకా చేసిన లబ్ధిదారుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆమెతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

దేశ ప్రగతికి విద్య దోహదపడాలి

జేఎన్‌టీయూఎన్ వీసీ డాక్టర్ ప్రసాదరాజు



జేఎన్‌టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజును సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ షేక్ మీరావలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు తాను నేర్చుకున్న విద్యను దేశ ప్రగతికి ఉపయోగించాలని జేఎన్‌టీయూకే వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు ఆకాంక్షించారు. కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల 15వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు వీసీ డాక్టర్ ప్రసాదరాజు, తహసీల్దార్ ఆర్‌వీ రమణనాయక్, సినీ ఫొటో డైరెక్టర్ టి.రవీంద్రనాథ్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవడం ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. సాంకేతిక రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకునే దిశగా యువత కృషిచేయాలన్నారు. తహసీల్దార్ రమణనాయక్ మాట్లాడుతూ సాంకేతిక రంగంతో పాటు ప్రభుత్వ రంగంలో కూడా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని వివరించారు. సినీ ఫొటో డైరెక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఎదో ఒక ప్రత్యేకత ఉంటుందని, దానిని గుర్తించి సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కళాశాల చైర్మన్ షేక్ మీరావలి మాట్లాడారు. ఈ సందర్భంగా ఢీ డాన్స్ షో కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జబర్దస్త్ కళాకారుల స్కిట్స్ విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీం మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, లియో గ్లోబల్ ఓవర్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌వీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా గీతమ్స్ పాఠశాల స్నాతకోత్సవం



వినుకొండ(నూజెండ్ల): గీతమ్స్ పాఠశాల స్నాతకోత్సవ వేడుకలు స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్‌హుసేన్ హాజరయ్యారు. సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.కోటిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, పాఠశాల డైరెక్టర్‌లు రమేష్, సీహెచ్ నారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ అనూరెడ్డి, శుభావిక్టోరియా పాల్గొన్నారు.

శ్రీ దత్తాలో రోగికి క్లిష్టతరమైన స్టంట్ అమరిక



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో అరుదైన అత్యంత క్లిష్టతరమైన గుండె ఆపరేషన్ నిర్వహించినట్లు శ్రీదత్తా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కారెంపూడి మండలం అడిగొప్పల నిదానం పాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో ప్రధాన అర్చకుడు ఆర్.విజయరామకుమార్(52) గుండె సమస్య రావడంతో వైద్యశాలలో పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. గుండెకు రక్త సరఫరా చేసే మూడు రక్తనాళాలు మూసుకుపోయి ప్రమాదంలో ఉన్నట్లు గుర్తించారన్నారు. సదరు రోగికి బైపాస్ సర్జరీ చేయించుకోవాలని సలహా ఇవ్వగా దానికి అతను అంగీకరించకపోవడంతో స్టెంట్ అమరికకు సిద్ధపడాల్సి వచ్చిందన్నారు. పల్నాటి ప్రాంతంలో ఇప్పటివరకు జరగని రీతిలో ఐవీయూఎస్ స్కానర్ ఆధారిత ప్రక్రియతో గుండె రక్తనాళాలను స్కానింగ్ చేస్తూ అత్యంత క్లిష్టతరంగా స్టంట్ అమరికను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఐదు రోజుల క్రితం ఈ ఆపరేషన్‌ను డాక్టర్ వేణుగోపాలరావు, డాక్టర్ జ్ఞానేశ్వరిల నేతృత్వంలోని కార్డియాలజీ వైద్య బృందం చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ అనంతరం రోగి కోలుకొని ఆరోగ్యంగా ఉన్నారని కుటుంబ సభ్యులు వెల్లడించారు.